హోలీ.. హోలీ... రంగేళి

● రంగులు, చిందులతో హోరెత్తిన నగరం

పెరంబూర్, మార్చి 25: రంగుల పండుగ హోలీ నగరంలో సందడి చేసింది. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరిలోనూ ఉత్సాహం నింపింది. స్థానిక షావుకార్‌పేట, పులియాంతోపు, వేపేరి, పట్టాలం, పురుషవాక్కం తదితర ప్రాంతాలను రంగులమయంగా మార్చింది. సోమవారం నగరంలోని ఉత్తర భారతీయులు హోలీ పండుగను అత్యంత కోలాహలంగా జరుపుకున్నారు. రకరకాల రంగులు విరజిమ్ముకుంటూ, హోలీ పండుగ శుభాకాంక్షలు చెప్పుకుంటూ యువతీయువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా గడిపారు.



హోలీ వేడుకల సందడి



కాలుష్య రహితమైన, రసాయనాలు కలపని రంగులను ముందే తెచ్చిపెట్టుకున్న ఉత్తర భారతీయులు.. సోమవారం ఉదయం నుంచి తమవారిపై వాటిని పులుముతూ అభిమానాన్ని చాటుకున్నారు. ఎవరిని చూసినా ఒంటినిండా రకరకాల రంగులతో ముచ్చటగొలిపారు. చిన్నారులు, యువతీయువకులు, వృద్ధులు సైతం ఉత్సాహంగా సందడి చేశారు. హోలీ తెచ్చిన ఆటపాటలతో వారికి హద్దే లేకపోయింది. ఎలాంటి అలసట లేకుండా అందరూ ఆనందడోలికల్లో తేలిపోయారు. పలు ప్రాంతాల్లో రాధాకృష్ణుల వేషధారణలో హోలీ పండుగ విశిష్టతను కళ్లముందుంచేలా అలరించారు. అదే విధంగా రాష్ట్రంలోని తిరువళ్లూరు, మదురై, తిరుప్పూర్, కృష్ణగిరి, సేలం, తేని తదితర ప్రాంతాల్లో కూడా హోలీ పండుగను ఉత్తర భారతీయులు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

కలిసొచ్చిన ముహూర్తం

● నామినేషన్లతో పోటెత్తిన అభ్యర్థులు

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఘట్టం ముగియడానికి ఇక రెండు రోజులే మిగిలి ఉండటం, సోమవారం పంగుణి ఉత్తిరం, పౌర్ణమి రెండూ కలసి వచ్చిన శుభమూహర్త దినం కావడంతో ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు చేతపట్టుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆఫీసులకు పోటెత్తారు. అన్నాడీఎంకే అయితే ప్రధాన కార్యక్రమాలకు ముహూర్తం చూసుకుని మరీముందుకు వెళ్తుందన్న విషం విదితమే. నాస్తికవాదానికి మద్దతిచ్చే అధికార పక్షమైన డీఎంకే కూడా శుభదినాల్లోనే పార్టీ కార్యకలాపాలను చేపట్టడం ఆనవాయితీగా మారింది. ఇక బీజేపీ గురించి చెప్పనక్కర్లేదు. ఆధ్యాత్మికవాదాన్ని రాజకీయాలను వేరుపరచి చూడలేని భావన కలిగిన ఆ పార్టీ కూడా ముహూర్తాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇలా మూడు పార్టీల అభ్యర్థులూ సోమవారం పంగుణి ఉత్తిరం, పౌర్ణమి శుభదినం సందర్భంగా నామినేషన్లు దాఖలు చేయడానికి బారులు తీరారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోగా నామినేషన్లు దాఖలు చేయడానికి పోటీపడ్డారు. అన్నాడీఎంకేకు చెందిన 33 మంది అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేస్తారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కొద్ది రోజులకే ముందే ప్రకటించారు. ఆ ప్రకారం నార్త్ చెన్నై నియోజకవర్గంలో మాజీ మంత్రి జయకుమార్ కుమారుడు జయవర్ధన్, కాంచీపురం (రిజర్వుడు) నియోజకవర్గంలో పెరుంబాక్కం రాజశేఖర్, శ్రీపెరుంబుదూరు (రిజర్వుడు) నియోజకవర్గంలో ప్రేమ్‌కుమార్ నామినేషన్లు సమర్పించారు. ఇదే విధంగా అన్నాడీఎంకే కూటమి మిత్రపక్షాలైన డీఎండీకే, ఎస్డీపీఐ అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. డీఎండీకే తరఫున సెంట్రల్ చెన్నైలో పార్థసారథి, తిరువళ్లూరు (రిజర్వుడు) నియోజకవర్గంలో నల్లతంబి, విరుదునగర్‌లో విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకరన్ నామినేషన్‌లు దాఖలు చేశారు.



నామినేషన్ సమర్పిస్తున్న సౌత్ చెన్నై డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగపాండ్యన్



నార్త్ చెన్నై అన్నాడీఎంకే అభ్యర్థి జయవర్ధన్ నామినేషన్ దాఖలు

డీఎంకే అభ్యర్థులు...

అదే విధంగా డీఎంకే, కాంగ్రెస్ మినహా దాని మిత్రపక్షాలకు చెందిన అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీపెరుంబుదూరు నియోజకవర్గం డీఎంకే అభ్యర్థి టీఆర్‌బాలు చెంగల్పట్టు కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. సౌత్ చెన్నైలో తమిళచ్చి తంగపాండ్యన్ అడయార్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ సమర్పించారు. నార్త్ చెన్నై అభ్యర్థి కళానిధి వీరాసామి రాయపురం జోనల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఇదే విధంగా నాగపట్టినం, తిరుప్పూరులో సీపీఎం అభ్యర్థులు, మదురై, దిండుగల్‌లో సీపీఎం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తిరుచ్చిలో ఎండీఎంకే అభ్యర్థి దురై వైగో, డీపీఐ అభ్యర్థి రవికుమార్ విల్లుపురంలో నామినేషన్ దాఖలు చేశారు. డీపీఐ నేత తిరుమావళవన్ ఈనెల 27న చిదంబరంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు.



సౌత్ చెన్నైలో నామినేషన్ దాఖలు చేస్తున్న తమిళిసై

బీజేపీ అభ్యర్థులు..

సౌత్ చెన్నై నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అడయార్‌లోని రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. కన్నియాకుమారిలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్ నాగర్‌కోవిల్‌లోని రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. తిరునెల్వేలిలో నయినార్ నాగేంద్రన్, నార్త్ చెన్నై బీజేపీ అభ్యర్థి న్యాయవాది ఆర్‌సీ పాల్ కనకరాజ్, సెంట్రల్ చెన్నై అభ్యర్థి వినోజ్ సెల్వం, నామినేషన్లు దాఖలు చేశారు. ఇదే విధంగా బీజేపీ కూటమి తరఫున పోటీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఒ. పన్నీర్‌సెల్వం రామనాథపురంలో నామినేషన్ సమర్పించారు. నామ్ తమిళర్ కట్చి 40 మంది అభ్యర్థుల్లో ముప్పావు శాతం మంది సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఆ పార్టీకి చెందిన నార్త్ చెన్నై అభ్యర్థి డాక్టర్ అముదిని, సౌత్ చెన్నై అభ్యర్థి ప్రొఫెసర్ తమిళ్‌సెల్వి సోమవారం ఉదయం నామినేషన్లు సమర్పించారు.



శివగంగలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ చిదంబరం

రాష్ట్రానికి అదనంగా

165 కంపెనీల పారా మిలటరీ బలగాలు

● ఎన్నికల ప్రధాన అధికారి

ప్యారీస్, మార్చి 25: రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేలా భద్రతను పటిష్ఠం చేశామని, అదనంగా 165 కంపెనీల పారామిలటరీ బలగాలను రప్పిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి సత్యప్రదసాహు పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని, ఈసారి ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఓటర్లకు వినియోగించేందుకు హ్యాండ్ బుక్ ముద్రించామన్నారు. ఈ నెలాఖరు నుంచి ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌చే గుర్తింపు పొందిన డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ తదితర పార్టీలకు ఎన్నికల గుర్తులు కేటాయిస్తున్నామని, ఈ పార్టీల తరఫున ప్రచార సభల్లో ప్రసంగించేందుకు ఇప్పటివరకు 453 మందికి గుర్తింపుకార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామని, స్థానిక పోలీసులు, హోంగార్డులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 24 గంటలు షిఫ్టు విధానంలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఇప్పటివరకు విజిల్ యాప్ ద్వారా స్వీకరించిన 11,305 ఫిర్యాదులపై విచారణ జరపాల్సిందిగా సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 190 కంపెనీల పారా మిలిటరీ బలగాలు ఎన్నికల భద్రతా పనుల్లో పాల్గొంటాయన్నారు. ఎండీఎంకే, డీపీఐ, పుదియ తమిళగం పార్టీలకు ఇంకా ఎన్నికల గుర్తులు కేటాయించలేదని సత్యప్రద సాహు తెలిపారు.



హ్యాండ్‌బుక్‌ను పరిచయం చేస్తున్న సత్యప్రద సాహు

కాంగ్రెస్ ఖాతాల స్తంభనకు బీజేపీ కుట్ర

● టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై



అభ్యర్థులను పరిచయం చేస్తున్న సెల్వపెరుందగై

అడయార్, మార్చి 25: తమ పార్టీకి చెందిన 11 బ్యాంకుల ఖాతాల లావాదేవీలను నిలిపివేయడం వల్ల కాంగ్రెస్ పార్టీని స్తంభింపజేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారతీయ జనతా పార్టీ కుట్రపన్నాయని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ఆరోపించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులకు ఆయన స్థానిక రాయపేటలోని సత్యమూర్తి భవన్ కార్యాలయంలో ఫాం-ఎ, ఫాం-బిలను అభ్యర్థులకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తమ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలను స్తభింప జేయడం వల్ల పార్టీ కార్యకలాపాలను అడ్డుకోవాలని ప్రధాని మోదీ కుట్ర పన్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ అహింసాయుత మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ గ్రహించాలన్నారు. డబ్బు ఒక అంశమే కాదన్నారు. తమ పార్టీ ప్రజలను నమ్ముకుని ఉందన్నారు. వ్యక్తుల ముఖాలను చూసి టిక్కెట్లు ఇచ్చే పార్టీ కాదన్నారు. కేవలం అభ్యర్థుల గెలుపోటముల ఆధారంగానే ఇస్తామన్నారు. ప్రజలకు విశ్వాసంగా ఉండేవారు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేవారికి మాత్రమే టిక్కెట్లు ఇస్తామన్నారు.

నేటినుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు

ఐసిఎఫ్, మార్చి 25: టెన్త్ పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రారంభం కానుండగా, 9.10 లక్షల మంది హాజరుకానున్నారు. రాష్ట్రప్రభుత్వ పాఠ్య ప్రణాళికలో ఈనెల 1న ప్రారంభమైన ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు ఈనెల 22, ఈనెల 4న ప్రారంభమైన ప్లస్‌వన్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 25న సోమవారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో, టెన్త్ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 4,107 పరీక్షా కేంద్రాల్లో 12,616 పాఠశాలలకు చెందిన 9.10 లక్షల మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో 4.52 లక్షల మంది విద్యార్థులు, హిజ్రా, 28,827 మంది ప్రైవేటు విద్యార్థులు, 235 మంది ఖైదీలు ఉన్నారు. మొత్తం 48,700 మంది ఉపాధ్యాయులు, పాఠశాల విద్య ఉద్యోగులు పరీక్షల పర్యవేక్షణ పనులు చేపట్టనున్నారు. మొదటి రోజైన మంగళవారం తమిళం సహా మాతృభాషలు, అనంతరం ఆంగ్లం, గణితం, సైన్స్, ఐచ్ఛిక భాష, సోషల్ సైన్స్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 8వ తేది పరీక్షలు ముగియనుండగా, పరీక్షా ఫలితాలు మే 10వ తేది విడుదల కానున్నాయి.


విద్యార్థులకు సీఎం శుభాకాంక్షలు

ప్యారీస్: రాష్ట్రంలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మంచి మార్కులు సాధించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ప్రశ్నపత్రాన్ని చదువుకొనేందుకు ముందుగా పది నిమిషాలు అవకాశం కల్పించామని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంజాన్ వేళలు

మంగళవారం : ఇఫ్తార్ : సాయంత్రం -6.27

బుధవారం : సహర్ : ఉదయం -4.29



ఉత్తర చెన్నై రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో

డీఎంకే, అన్నాడీఎంకే వాగ్వాదం

ప్యారీస్, మార్చి 25: ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గ నామినేషన్ దాఖలు సమయంలో డీఎంకే, అన్నాడీఎంకే నేతల మధ్య వాగ్వాదం జరిగింది. రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ రిటర్నింగ్ అధికారితో తమ పార్టీ అభ్యర్థి నామినేషన్ పత్రాలను ముందుగా స్వీకరించాలని పట్టుబట్టారు. రెండు ప్రధాన పార్టీల నేతల మధ్య వాగ్వాదం కారణంగా ఆ కార్యాలయంలో సుమారు 20 నిమిషాలు గందరగోళం నెలకొంది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ప్రకటించిన అభ్యర్థులందరూ సోమవారం ఫాల్గుణ పౌర్ణమి శుభదినం కావడంతో నామినేషన్ దాఖలుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు తమ పార్టీ శ్రేణులతో కలసి వెళ్లారు. ముహూర్త సమయం దాటక ముందే నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు వరుసలో వేచి ఉండి టోకెన్ పొందాల్సి ఉంది. టోకెన్ నెంబరు ప్రకారమే అభ్యర్థులను కార్యాలయంలోకి అనుమతిస్తారు. ఆ రీతిలో బేసిన్ బ్రిడ్జి సమీపంలో ఉన్న ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి టోకెన్లు పొందారు. అన్నాడీఎంకే అభ్యర్థి రాయపురం మనోకు 7వ నెంబరు, డీఎంకే అభ్యర్థి కళానిధి వీరాస్వామికి 8వ నెంబరు, బీజేపీ అభ్యర్థి పాల్ కనకరాజ్‌కు 9వ నెంబరు టోకెన్లు పంపిణీ చేశారు. ముందు ఆరు టోకెన్లు పొందిన అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం అన్నాడీఎంకే, డీఎంకే అభ్యర్థులు ఒకేసారి కార్యాలయానికి వచ్చారు. కళానిధి వీరాస్వామితో మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు ఆర్టీ శేఖర్, ఐడ్రీం మూర్తి, ఎబినేజర్ వెళ్లి ముందే కుర్చీల్లో కూర్చున్నారు. రాయపురం మనోతో మాజీ మంత్రి డి.జయకుమార్, జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌బాబు వెళ్లారు. అప్పుడు రిటర్నింగ్ అధికారితో తన నామినేషన్ పత్రాలు ముందుగా స్వీకరించాలని రాయపురం మనో డిమాండ్ చేశారు. అందుకు డీఎంకే నేతలు అభ్యంతరం తెలియజేయడంతో ఇరువర్గాల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది.



రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నేతల వాగ్వాదం

ఇదిలా ఉండగా, గంట సమయం దాటినా డీఎంకే, అన్నాడీఎంకే నేతలు బయటకు రాకపోవడంతో ఆగ్రహించిన బీజేపీ అభ్యర్థి పాల్ కనకరాజ్ తమ పార్టీ నేతలతో కలసి కార్యాలయంలోకి చొరబడేందుకు యత్నించారు. ఈ రకంగా మూడు పార్టీల అభ్యర్థులు వాగ్వాదానికి దిగడంతో రిటర్నింగ్ అధికారి కట్టా రవితేజ జోక్యం చేసుకుని నామినేషన్ పత్రాలు మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తానని, ఇందులో అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పి వారిని సమాధానపరిచారు.

సమాచార దర్శిని

31న ఆదిభట్ల నారాయణదాసు వ్యక్తిత్వం - సాహిత్యంపై ప్రసంగం

ప్యారీస్, మార్చి 25: నగరంలోని వేద విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 147వ ప్రసంగం ఆదిభట్ల నారాయణ దాసు వ్యక్తిత్వం - సాహిత్యంపై ఈ నెల 31న జరగనుంది. టి.నగర్ విజయరాఘవ రోడ్డులో ఉన్న ఆంధ్ర క్లబ్ ప్రాంగణంలోని కృష్ణ హాలులో సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో గుంటూరు విశ్వనాథ సాహిత్య అకాడమీ కార్యదర్శి మోదుగుల రవికృష్ణ వక్తగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి తరలిరావాల్సిందిగా సాహితీప్రియులకు వేద విజ్ఞాన వేదిక నిర్వాహకులు జేకే రెడ్డి, కందనూరు మధు పిలుపునిచ్చారు.

34 నెలల్లో 1,498 ఆలయాల్లో కుంభాభిషేకం

పెరంబూర్, మార్చి 25: రాష్ట్రంలో గడిచిన 34 నెలల్లో హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 1,498 ఆలయాల్లో కుంభాభిషేకం నిర్వహించినట్లు ప్రకటించారు. వాటిలో 100 ఏళ్ల అనంతరం 5 ఆలయాలు, 70 ఏళ్ల అనంతరం ఆరు, 50 ఏళ్ల అనంతరం 15, 30 ఏళ్ల అనంతరం 15 ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించారు. 2021 మే 7నుంచి ఈనెల 20వ తేది వరకు కుంభాభిషేకం నిర్వహించిన ఆలయాల వివరాలు విడుదల చేసినట్లు దేవాదాయ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది.

స్తంభించిన ప్రభుత్వ వెబ్‌సైట్

ఐసిఎఫ్, మార్చి 25: ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ఆదివారం స్తంభించింది. ఈ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ శాఖలు విడుదల చేసే జీవోలు, సమాచార శాఖ విడుదల చేసే ముఖ్యాంశాలు ఉంటాయి. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, మంత్రుల మొబైల్ నెంబర్లు, ఈ-మెయిల్ చిరునామాలుంటాయి. వివిధ సేవల కోసం ప్రజలు ఈ వెబ్‌సైట్ వినియోగిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి వెబ్‌సైట్ పనిచేయడం లేదని, ఎవరు హ్యాక్ చేశారో తెలియలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

బిల్లు ఆలస్యంగా చెల్లిస్తే జరిమానా

ఐసిఎఫ్, మార్చి 25: బిల్లు ఆలస్యంగా చెల్లిస్తే రూ.500 జరిమానా విధించనున్నట్లు పార్లర్ నిర్వాహకులకు ఆవిన్ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఆవిన్ సంస్థ తయారుచేసే 230కి పైగా ఉత్పత్తులు ఆవిన్ పార్లర్లు, సూపర్ మార్కెట్లలో విక్రయమవుతున్నాయి. నగరంలో మాత్రమే 4,000కు పైగా ఆవిన్ పార్లర్లు ఉన్నాయి. ఈ పార్లర్లలో వసూలైన నగదును ఎప్పటికప్పుడు చెల్లించాల్సి ఉంది. సరైన సమయానికి బిల్లు చెల్లించని పార్లర్ నిర్వాహకులకు రూ.500 జరిమానా విధించనున్నట్లు ఆవిన్ సంస్థ హెచ్చరించింది.

ప్రభుత్వ బస్సుల్లో పెరిగిన బుకింగ్

ఐసిఎఫ్, మార్చి 25: రాష్ట్రంలో ప్రభుత్వ బస్సుల్లో బుకింగులు పెరిగాయి. గత ఏడాది మార్చితో పోల్చగా ఈ ఏడాది 16.81 శాతం రిజర్వేషన్లు పెరిగాయని రవాణా సంస్థ తెలిపింది. ఈ ఏడాది మొత్తం 2.38 లక్షల మంది రిజర్వేషన్ చేయించుకొని ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించారని అధికారులు తెలిపారు. టీఎన్ఎస్టీసీ యాప్, వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో మరో 20 టోల్ ప్లాజాలు

ఐసిఎఫ్, మార్చి 25: రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారుల్లో రాబోయే రెండేళ్లలో మరో 20 టోల్ ప్లాజాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేలో 6, విల్లుపురం - నాగపట్టినం జాతీయ రహదారిలో 3, విక్కిరవాండి - నాగపట్టినం జాతీయ రహదారిలో 3, హోసూరు - ధర్మపురి జాతీయ రహదారిలో 3, చిత్తూరు - తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో 3, మహాబలిపురం - పుదుచ్చేరి జాతీయ రహదారిలో రెండు కొత్త టోల్ ప్లాజాలు ఏర్పాటు కానున్నాయి.

నగరంలో లింక్ రోడ్ల ఏర్పాటు

ఐసిఎఫ్, మార్చి 25: నగరంలో ట్రాఫిక్ సమస్య నియంత్రించేలా లింక్ రోడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలు ప్రకటించడానికి ముందుగా 1,188 రహదారుల పునరుద్ధరణ పనులకు చెన్నై కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పనులు ఏప్రిల్‌లో ప్రారంభం కానున్నాయి. ఇవి మినహా మెట్రోరైలు పనులతో ఏర్పడే ట్రాఫిక్ సమస్య నియంత్రించేలా నగరంలో కొత్తగా లింక్ రోడ్ల ఏర్పాటుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. శాంథోమ్, మైలాపూర్, అన్నానగర్, మదురవాయల్, పూందమల్లి, వానగరం తదితర ప్రాంతాల్లో ఈ రోడ్లు ఏర్పాటు కానున్నాయి.

రూ.24 కోట్లతో కృష్ణా కాలువ పునరుద్ధరణ

ఐసిఎఫ్, మార్చి 25: కృష్ణా కాలువ పునరుద్ధరణ పనులు రూ.24 కోట్లతో జరుగుతున్నాయి. తమిళనాడు - ఆంధ్ర నదీజలాల ఒప్పందం ప్రకారం రాష్ట్రానికి ఆంధ్ర ప్రభుత్వం యేటా జూలై నుంచి అక్టోబరు వరకు 8 టీఎంసీలు, జనవరి నుంచి ఏప్రిల్ వరకు 4 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉంది. ఊత్తుకోట అంబేడ్కర్ నగర్, అనంతేరి, కచ్చూర్ ప్రాంతాల్లో కృష్ణా కాలువ గట్లు ధ్వంసం కావడంతో రూ.24 కోట్లతో మరమ్మతులు జరగనున్నాయి. ప్రస్తుతం ఊత్తుకోట అంబేడ్కర్ నగర్ నుంచి చిత్రపాక్కం వరకు ఇరువైపులా పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

89,000 ఎన్నికల ప్రకటనల తొలగింపు

ఐసిఎఫ్, మార్చి 25: ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో 89,000 ఎన్నికల ప్రకటనలు, పోస్టర్లను తొలగించారు. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19న జరగనున్నాయి. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై ఉన్న ఎన్నికల ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు వంటివి తొలగిస్తున్నారు. నగరంలోనిమూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో 61,694 వాల్ పెయింటింగులు, 12,063 పోస్టర్లు, 540 బ్యానర్లు, 1,138 ఇతర ప్రకటనలు తొలగించినట్లు అధికారులు తెలిపారు.

55,355 మందికి తపాలా ఓటు ఫారాలు

ఐసిఎఫ్, మార్చి 25: దివ్యాంగులు, 85 ఏళ్లకు పైబడిన వారు అని 55,355 మందికి తపాలా ద్వారా ఓటు వేసే ఫారాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. నగరంలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో 85 ఏళ్లకు పైబడిన ఓటర్లు 63,751 మంది, దివ్యాంగులు 11,369మంది ఉన్నారు. వీరికి తపాలా ఓటు వినియోగించుకొనేందుకు 12డీ ఫారాన్ని అధికారులు ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నారు. ఈనెల 20నుంచి ఆదివారం వరకు 55,355 ఫారాలు అందజేసి, అందులో పూర్తిచేసిన 5,030 ఫారాలను స్వీకరించారు.

పెరిగిన పూల ధరలు

ఐసిఎఫ్, మార్చి 25: పంగుణి ఉత్తిరై పురస్కరించుకొని కోయంబేడు పూల మార్కెట్లో అన్నిరకాల పూల ధరలు పెరిగాయి. కిలో మల్లెలు, ఐస్ మల్లె రూ.600, అడవి మల్లెలు, జాజిమల్లెలు రూ.500, కనకాంబరాలు రూ.700, గన్నేరు రూ.300, చామంతి రూ.350, సంపంగి రూ.250, చాక్లెట్ రోజ్ రూ.100, పన్నీర్ రోజ్ రూ.80కు విక్రయమయ్యాయి.

అర్ధరాత్రి కంటైనర్ లారీ ఆకస్మిక తనిఖీ

- పాడి ఫ్లైఓవర్ వద్ద కలకలం
- కరెన్సీనోట్ల కట్టలు స్వాధీనం?

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పాడి ఫ్లైఓవర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి హరియాణా రిజిస్ట్రేషన్ నెంబర్ కలిగిన కంటైనర్ లారీని ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేశారు. ఆ కంటైనర్ లారీ ముందువరసలో ఉన్న కొన్ని అట్టపెట్టెలను తనిఖీ చేయగా బీజేపీ జెండాలు, టోపీలు కనిపించాయి. ఆ తర్వాత వరుసలో ఉన్న అట్టపెట్టెలను తెరచిన అధికారులు చటుక్కున వాటిని మూసివేసి కంటైనర్ తలుపులకు తాళం బిగించారు. ఆ తర్వాత ఆ కంటైనర్ లారీ వద్దకు సుమారు 50 మంది సాయుధ పోలీసులను రప్పించారు. కంటైనర్ లారీని విల్లివాక్కంలోని ప్రైవేటు పాఠశాల మైదానానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆ కంటైనర్ లారీ చూడటానికి పెద్ద సంఖ్యలో గుమికూడారు. సోమవారం వేకువజాము ఆ కంటైనర్ లారీ అమింజికరైకి తీసుకెళ్లారు. ఆ లారీలోని అట్టపెట్టెలలో కరెన్సీ నోట్ల కట్టలు ఉండటం వల్లే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తరచూ ఆ లారీని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఆ కంటైనర్‌లో ఏముందో ప్రకటించకుండా ఎన్నికల సంఘం అధికారులు ఇంకా మౌనం పాటిస్తున్నారు.



కంటైనర్ లారీ వద్ద గుమికూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, స్థానికులు

వెల్లయంగిరి కొండకు వెళ్లిన ముగ్గురు భక్తులు మృతి

పెరంబూర్, మార్చి 25: వెల్లయంగిరి కొండకు వెళ్లిన ముగ్గురు వరుసగా మృతిచెందడం భక్తులను కలవరపరిచింది. పశ్చిమ కనుమల కొండ ప్రాంతంలో దక్షిణ కైలాసంగా పేరుగాంచిన వెల్లయంగిరి ఆలయానికి ఏడు పర్వతశ్రేణులు దాటి స్వయంభుగా ఉన్న శివలింగాన్ని దర్శించుకొనేందుకు భక్తులు ఆసక్తి చూపుతుంటారు. ఫిబ్రవరి నుంచి మే వరకు భక్తులు ఈ కొండ ఆలయానికి అధికారులు అనుమతిస్తుంటారు. ఈ ఏడాది పెద్దసంఖ్యలో భక్తులు వస్తుండగా, వారు కొండ ఎక్కే సమయంలో ఆయాసంతో శ్వాస తీసుకోలేక మృతి చెందే అవకాశముందని భావించిన అగ్నిమాపక శాఖ తాత్కాలిక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో, ఆదివారం వెల్లయంగిరి కొండ ఎక్కేందుకు హైదరాబాద్‌కు చెందిన సుబ్బారావు(68) నాలుగవ కొండ దాటుతుండగా మృతిచెందాడు. అలాగే, సేలంకు చెందిన త్యాగరాజన్ (38) అనారోగ్యానికి గురై మూడో కొండ మార్గంలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది మూటలు మూసే కార్మికుల సాయంతో మృతదేహాలను కొండ నుంచి కిందకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో, సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తేని జిల్లాకు చెందిన పాండ్యన్(46) రెండో కొండ సమీపంలోని వళుక్కుపారై సమీపంలో శ్వాసతీసుకొనేందుకు ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న అటవీ సిబ్బంది, అక్కడకు వెళ్లేలోపు అతను మృతిచెందాడు.



మృతులు సుబ్బారావు, త్యాగరాజన్, పాండ్యన్ (ఫైల్ ఫొటో)

ఎంజీఆర్, జయ చిత్రపటాలతో ప్రచారం

- బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్

పెరంబూర్, మార్చి 25: తనకు గుర్తింపునిచ్చిన సీఎంలు జయ, ఎంజీఆర్ చిత్రపటాలతో ఎన్నికల ప్రచారం చేస్తానని తిరునల్వేలి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా నయినార్ నాగేంద్రన్ తెలిపారు. తిరునల్వేలి కలెక్టరేట్‌లో సోమవారం రిటర్నింగ్ అధికారి కార్తికేయన్‌ను నామినేషన్ పత్రాలు అందజేసిన అనంతరం నాగేంద్రన్ విలేకరులతో మాట్లాడుతూ... శాసనసభ్యుడిగా ఉన్న తనకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం కల్పించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. 25 ఏళ్లుగా మంత్రిగా, శాసనసభ్యుడిగా తిరునల్వేలి జిల్లా అభివృద్ధికి కృషి చేశానని, ప్రజలు తనను ఆదరించి గెలిపిస్తారని నమ్మకం ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఓపీఎస్ కోరుతున్న 'పన్నీర్ ద్రాక్ష' గుర్తు

పెరంబూర్, మార్చి 25: రామనాథపురం లోక్‌సభ స్థానంలో బీజేపీ కూటమిలో స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తనకు 'బక్కెట్', 'పనస పండు', 'పన్నీర్ ద్రాక్ష' గుర్తులు కేటాయించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. వీటిలో ద్రాక్ష గుర్తు వస్తే ప్రచారానికి సులభంగా ఉంటుందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

ఇళయరాజా కేసు విచారణ...

తప్పుకున్న న్యాయమూర్తి

పెరంబూర్, మార్చి 25: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరపరచిన పాటలు వినియోగించడంపై విధించిన స్టే రద్దు చేయాలని పిటిషన్ దాఖలైంది. ఎకో రికార్డింగ్ సంస్థ దాఖలు చేసిన ఈ కేసు విచారణ నుంచి న్యాయమూర్తి ఆర్.సుబ్రమణ్యం వైదొలిగారు. విచారణ వేరే ధర్మాసనం విచారించేలా ప్రధాన న్యాయమూర్తి అనుమతులు పొందాలని రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇళయరాజా పాటలు వినియోగించడంపై ఎకో, ఆగి మ్యూజిక్ సంస్థలకు తాత్కాలిక నిషేధం విధించిన విషయం తెలిసిందే.

అన్నామలై మతిస్థిమితం లేని వ్యక్తి

- సీపీఎం ఎంపీ నటరాజన్

అడయార్, మార్చి 25: కోయంబత్తూరు లోక్‌సభ స్థానంలో బీజేపీ తరపున పోటీ చేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై మతిస్థిమితం లేని వ్యక్తి అని సీపీఎం ఎంపీ నటరాజన్ విమర్శించారు. కోవైలో ఇండియా కూటమి తరపున జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక ఫాసిస్ట్ సర్కార్ అన్నారు. రాష్ట్రంలో 90 శాతం వర్షపాతం నమోదైందని వాతావరణ నిపుణులు చెబితే దేశంలోనే 90 శాతం వర్షపాతాన్ని నమోదు చేసే పరికరాలు లేవని హేళనగా బీజేపీ నేతలు మాట్లాడారన్నారు. ఇపుడు కోవైలో కూడా పగటి ఉష్ణోగ్రత పెరిగిపోవడానికి డీఎంకేనే కారణమని మరో కొత్త కథను తెరపైకి తెచ్చిన ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు.

అన్నామలైకు డిపాజిట్ దక్కనీయం

- రిటైర్డ్ జడ్జి హరిపరంథామన్

అడయార్, మార్చి 25: లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూరు నుంచి పోటీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలైకు డిపాజిట్ దక్కకుండా చేస్తామని మాజీ న్యాయమూర్తి హరిపరంథామన్ ప్రకటించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం గద్దె దించాలన్నారు. కోవైలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అన్నామలైకు ధరావతు కూడా రాకుండా చేయాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తమిళనాడు పొదుమేడై అమైప్పు అనే సంస్థ ఆధ్వర్యంలో జరిగిన చర్చాగోష్టిలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు.

ఆదివారం పనిచేయనున్న వసూలు కేంద్రాలు

- చెన్నై మెట్రోవాటర్ బోర్డు

పెరంబూర్, మార్చి 25: తాగునీరు, మురికినీటి పన్ను చెల్లించే వినియోగదారుల సౌకర్యార్థం ఆదివా రం అన్ని వసూలు కేంద్రాలు పని చేస్తాయని చెన్నై మెట్రోవాటర్ బోర్డు తెలిపింది. నగరంలో గృహ, వాణి జ్య భవనాల యజమానులు చెల్లించాల్సిన తాగు, మురుగు నీటి పన్ను చెల్లింపు గడువు ఈనెల 31వ తేదీతో ముగియనుంది. ఆ రోజు ఆదివారం కావడంతో, వినియోగదారుల సౌకర్యార్థం ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని వసూలు కేంద్రాలు పనిచేస్తాయని వాటర్ బోర్డు తెలిపింది.

వృద్ధురాలి వద్ద రూ.1.50 లక్షలు స్వాధీనం

అడయార్, మార్చి 25: స్థానిక అడయారు ప్రాంతంలో కారులో వచ్చిన ఒక వృద్ధురాలి వద్ద ఉన్న రూ.1.50 లక్షలను ఎన్నికల బందోబస్తు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోడ్‌లో భాగంగా ఆదివారం అడయారు, ఇందిరా నగర్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో కారులో వచ్చిన కళ (66) అనే వృద్ధురాలి వద్ద ఉన్న రూ.1.50 లక్షలు గుర్తించి స్వాధీనం చేసుకుని ట్రెజరీకి అప్పగించారు. సరైన పత్రాలు చూపించి నగదు తీసుకెళ్లాలని వృద్ధురాలికి సూచించారు.

పర్యాటకురాలి నుంచి నగదు స్వాధీనం

- కన్నీటిపర్యంతమైన మహిళ

పెరంబూర్, మార్చి 25: నీలగిరి జిల్లా కున్నూరు - మేట్టుపాళయం జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన మహిళ విహార యాత్రకు తన పిల్లలతో కలసి విమానాశ్రయం నుంచి కారులో ఊటీకి వెళ్తున్నారు. ఆమె వెళ్తున్న కారును అడ్డుకున్న అధికారులు, ఆమె నుంచి రూ.68,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. విహారయాత్ర కోసం పిల్లలతో కలసి వెళ్తున్నామని, ఖర్చుల కోసం నగదు ఉంచుకున్నానని సదరు మహిళ కన్నీటి పర్యంతమైనా, ఎన్నికల నిబంధనలు ప్రకారం రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్తే అందుకు సంబంధించిన రసీదులు చూపాలని పేర్కొన్న అధికారులు, నగదు స్వాధీనం చేసుకున్నారు.



మహిళ నుంచి నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పుదుచ్చేరిలో నామినేషన్ పర్వం



నామినేషన్లు సమర్పిస్తున్న నమశ్శివాయం, తమిళ్‌వేందన్, మేనక

పుదుచ్చేరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో సోమవారం ఉదయం బీజేపీ అభ్యర్థి నమశ్శివాయం నామినేషన్ దాఖలు చేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, పార్టీ నాయకులతో ఊరేగింపుగా వెళ్లి ఆయన రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. ఇదే విధంగా అన్నాడీఎంకే అభ్యర్థి తమిళ్‌వేందన్, నామ్ తమిళర్ కట్చి తరపున పోటీ చేస్తున్న మేనక నామినేషన్‌ను దాఖలు చేశారు. డీఎంకే కూటమి ఈ నియోజకవర్గాన్ని తన మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు కేటాయించింది. కాంగ్రెస్ అధిష్ఠానం ఈ నియోజవర్గానికి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

ఇస్కాన్ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

అడయార్, మార్చి 25: స్థానిక ఈస్ట్‌కోస్ట్ రోడ్డు, అక్కరైలో ఉన్న ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణుడు స్వయంగా దర్శనమిచ్చిన రోజును పురస్కరించుకుని సోమవారం గౌరిపూర్ణిమ వేడుకను ఘనంగా నిర్వహించారు. హరే కృష్ణ మహా మంత్రంతో పాటు హరినామ కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన మహా అభిషేకలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పంచామృతం, బహుళ వర్ణపూల రేకులు, పంచగవ్య, వివిధ రకాల పండ్ల రసాల మిశ్రమంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద వితరణ జరిగింది.

భగవద్గీత సూక్తులు సన్మార్గానికి సోపానాలు

- డాక్టర్ కుమార్ విశ్వాస్

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రామాయణం, భగవద్గీతలు సన్మార్గానికి సోపానాలని, మానవులకు ఆచరణాత్మకమైన జ్ఞానాన్ని అందిస్తాయని ప్రముఖ వక్త, కవి డాక్టర్ కుమార్ విశ్వాస్ అన్నారు. నగరానికి చెందిన ప్రముఖ వాణిజ్య సంస్థ అగ్రట్రేడ్ ఆధ్వర్యంలో స్థానిక లేడీ ఆండాళ్ ఆడిటోరియంలో 'యాన్ ఈవెనింగ్ విత్ డాక్టర్ కుమార్ విశ్వాస్' పేరుతో ఏర్పాటైన సభలో ఆయన ప్రసంగించారు. అగ్రట్రేడ్ సంస్థ అధ్యక్షుడు రవి సరాఫ్ స్వాగతోపన్యాసం చేశారు. సంస్థ కార్యదర్శి రామ్జీ రుంగుటా, ఈవెంట్ చైర్మన్ సునీల్‌కుమార్ సరాఫ్, కో చైర్మన్ సుమిత్ కెడియా సహా 1200 మంది పాల్గొని సభకు నిండుదనం చేకూర్చారు.



కుమార్‌కు నిర్వాహకుల సత్కారం

పురుషుడిగా మారిన స్నేహితురాలి నుంచి ఎడబాటు

- మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

అడయార్, మార్చి 25: పురుషుడిగా మారిన స్నేహితురాలి నుంచి వేరు చేయడాన్ని జీర్ణించుకోలేని ఒక మహిళా కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాదకర ఘటన తూత్తుకుడి జిల్లాలో జరిగింది. తూత్తుక్కుడి స్పిక్ నగర్‌కు చెందిన హరిప్రియ (28) అనే మహిళ తూత్తుకుడి సాయుధ విభాగంలో కానిస్టేబుల్. మొదటి భర్త నుంచి వేరు కావడంతో ఆరు నెలల క్రితం రెండో వివాహం చేసుకుంది. అయితే, యేడాదిన్నర క్రితం మదురైలో సాయుధ విభాగంలో శిక్షణ పొందే సమయంలో నవనీత ప్రియ అనే లేడీ కానిస్టేబుల్ పరిచయమయ్యారు. అప్పటి నుంచి వీరిద్దరు ప్రాణస్నేహితులుగా ఉంటూ లెస్బియన్స్‌గా మారారు. ఈ క్రమంలో నవనీత ప్రియ లింగమార్పిడి చికిత్స చేయించుకుని పురుషుడిగా మారింది. ఆ తర్వాత హరిప్రియ రహస్యంగా నవనీత ప్రియను వివాహం చేసుకుంది. అప్పటి నుంచి హరిప్రియ ప్రవర్తనలో మార్పు రావడంతో భర్త ఆంటోనీ జెనిత్ గుర్తించి వారిని వేరు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని హరిప్రియ ఆదివారం ఆత్మహత్య చేసుకుంది.

జనావాసాల్లోకి ప్రవేశించిన మొసలి

పెరంబూర్, మార్చి 15: జనావాసాల్లోకి ప్రవేశించిన మొసలిని అటవీ సిబ్బంది చాకచక్యంగా బంధించారు. కడలూరు జిల్లా చిదంబరం సమీపం కొల్లిడం నది తీరప్రాంత గ్రామమైన మేల్‌విత్తాంపట్టిలో నివసిస్తున్న సెల్వకుమార్ ఇంటి ప్రాంగణంలోకి సుమారు 6 అడుగుల పొడవు, 120 కిలోల బరువున్న మొసలి ఆదివారం రాత్రి ప్రవేశించింది. శబ్దం విని వెలుపలికి వచ్చిన సెల్వకుమార్, మొసలిని చూసి చిదంబరం అటవీ శాఖ కార్యాలయానికి సమాచారం అందించాడు. రేంజర్ ప్రభు నేతృత్వంలో అక్కడకు చేరుకున్న సిబ్బంది, మొసలిని బంధించి వక్కరామరి నదిలో వదిలిపెట్టారు.



మొసలిని బంధించిన అటవీ సిబ్బంది

తిరునెల్వేలి కాంగ్రెస్ అభ్యర్థి రాబర్ట్ బ్రూస్

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో కాంగ్రెస్ అభ్యర్థిగా రాబర్ట్ బ్రూస్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ కేంద్ర కమిటీ సోమవారం సాయంత్రం ప్రకటన జారీ చేసింది. కన్నియాకుమారి జిల్లాకు చెందిన రాబర్ట్‌బ్రూస్(62) న్యాయవాది. తిరునల్వేలి, కన్నియాకుమారిలో వివిధ పదవుల్లో కాంగ్రెస్ పార్టీకి విశిష్ట సేవలందించారు. 2015లో కన్నియాకుమారి ఈస్ట్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ తిరునల్వేలి జిల్లా నాంగునేరి ప్రచార సభలో పాల్గొననున్న సమయంలో తిరునల్వేలి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పేరును కాంగ్రెస్ కేంద్ర కమిటీ ప్రకటించింది. ఇదే విధంగా కన్నియాకుమారి జిల్లా విలవంగోడు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా తారగై కడ్‌బర్ట్ పోటీ చేయనున్నారు. విలవంగోడు కాంగ్రెస్ శాసనసభ్యురాలు విజయతరణి రాజీనామా చేసి బీజేపీలో చేరటంతో లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. డీఎంకే కూటమిలో పది స్థానాలు పొందిన కాంగ్రెస్ ఇప్పటివరకూ ఎనిమిది నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. మైలాడుదురై నియోజకవర్గానికి అభ్యర్థిని ఎంపిక చేయాల్సి ఉంది. మంగళవారంలోగా అభ్యర్థి పేరును ప్రకటిస్తారని తెలుస్తోంది.




తిరునల్వేలి కాంగ్రెస్ అభ్యర్థి రాబర్ట్ బ్రూస్, విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి తారగై కడ్‌బర్ట్

2025 పొంగల్‌కు అలంగానల్లూర్‌లో మహిళా జల్లికట్టు

పెరంబూర్, మార్చి 25: అలంగానల్లూర్‌లో మహిళా జల్లికట్టుకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్రంలో పొంగల్ పండుగ సందర్భంగా రాష్ట్ర సంప్రదాయ, సాహస క్రీడ జల్లికట్టు నిర్వహిస్తుంటారు. రాష్ట్రంలో ఈ పోటీలకు అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూర్ ప్రసిద్ధి గాంచాయి. ఈ నేపథ్యంలో, పర్యాటక సంస్థ యజమాని, జల్లికట్టు ప్రేమికుడు వీకేటీ బాలన్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... వచ్చే ఏడాది పొంగల్ సందర్భంగా అలంగానల్లూర్ జల్లిపోటీలు ముగిసిన తర్వాత అలంగానల్లూర్ సమీపంలోని జల్లికట్టు మైదానంలో మహిళా జల్లికట్టు పోటీలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అందుకు రాష్ట్రప్రభుత్వం, మదురై జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు పొందేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. తొలుత మహిళలు ఈ పోటీల్లో పాల్గొనలేరనే వార్తలున్నా, ప్రస్తుతం వారిలో కూడా జల్లికట్టు పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి పెరిగిందన్నారు. ఈ పోటీలకు మహిళా పోలీసులు, కబడ్డీ క్రీడాకారిణులు, కళాశాల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, వారికి మూడు నెలల శిక్షణ అందించనున్నామని తెలిపారు. తొలి మహిళా జల్లికట్టు కావడంతో తగిన ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నామని, పోటీల్లో పాల్గొనే మహిళలకు రక్షణతో కూడిన దుస్తులు అందిస్తామన్నారు. మహిళా జల్లికట్టు పోటీల్లో కూడా పురుషులకు అందించినట్లు కారు, బైక్, ఖరీదైన బహుమతులు అందిస్తామన్నారు. గాయపడే వారికే జీవిత బీమా పాలసీ అందించేలా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.



జల్లికట్టు ప్రేమికుడు వీకేటీ బాలన్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

పెరంబూర్, మార్చి 25: గుర్తుతెలియని వాహనం ఢీకొని ముగ్గురు యువకులు మృతి చెందారు. ఈ ఘటన కడలూరు జిల్లాలో సోమవారం ఉదయం జరిగింది. తిట్టకుడి సమీపం పాసారు గ్రామానికి చెందిన వెంకటేశన్(20), భరణి(20), సతీష్‌కుమార్ (20) ఒకే బైక్‌పై వెళుతున్నారు. కల్లూరు జంక్షన్ వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో వస్తున్న బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న రామనత్తం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను తిట్టకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఓపీఎస్‌కు మరోమారు చుక్కెదురు

పెరంబూర్, మార్చి 25: అన్నాడీఎంకే జెండా, చిహ్నం వినియోగానికి మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వంకు విధించిన నిషేధంపై స్టే విధించేందుకు మద్రాసు హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై ఓపీఎస్ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తి ఆర్.సుబ్రమణియన్, న్యాయమూర్తి శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులపై స్టే విధించేందుకు నిరాకరించిన ధర్మాసనం, ఈ పిటిషన్‌పై బదులు పిటిషన్ దాఖలు చేయాలని ఎడప్పాడి పళనిస్వామికి నోటీసు జారీ చేసి, తదుపరి విచారణ జూన్ 10వ తేదీకి వాయిదా వేసింది.

తపాలా ఓట్లు మళ్లీ లెక్కించాలి

- మద్రాసు హైకోర్టు

పెరంబూర్, మార్చి 25: గత శాసనసభ ఎన్నికల్లో కృష్ణగిరి నియోజకవర్గంలో నిరాకరించిన తపాలా ఓట్లను మళ్లీ లెక్కించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన అన్నాడీఎంకే అభ్యర్థి అశోక్‌కుమార్ గెలుపు రద్దు చేయాలని కోరుతూ డీఎంకే అభ్యర్థి సెంగుట్టవన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో 605 తపాలా ఓట్లను ఎన్నికల అధికారులు నిరాకరించారని, వాటిని మళ్లీ లెక్కించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం విచారించిన న్యాయమూర్తి పీటీ ఆషా, నిరాకరించబడిన 605 తపాలా ఓట్లను హైకోర్టు రిజిస్ట్రార్ సమక్షంలో లెక్కించి నివేదిక దాఖలు చేయాలని ఎన్నికల కమిషన్‌కు ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.18 లక్షల విలువైన ఐ ఫోన్ల స్వాధీనం

ఐసిఎఫ్, మార్చి 25: స్థానిక రాయపురంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.18 లక్షల విలువైన ఐ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాయపురం ఫ్లై ఓవర్ సమీపంలో అధికారులు తనిఖీలు నిర్వహించగా, ఆటోలో వచ్చిన యువకుడు వేగంగా వెళ్లేందుకు ప్రయత్నించాడు. అడ్డుకున్న అధికారులు, రెండు అట్టపెట్టెల్లో ఉన్న రూ.18 లక్షల విలువైన 12 ఐ ఫోన్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి జిల్లాకు చెందిన అసాన్(30) రాయపురం బంధువుల ఇంట్లో బస చేస్తున్నాడు. ప్యారీస్‌లో ఉన్న బర్మా బజార్ దుకాణాల్లో విక్రయించేందుకు సెల్‌ఫోన్లు తరలిస్తున్నట్లు విచారణలో తెలిసింది.

మీ ప్రాంతాల్లోని జ్వర బాధితులపై వెబ్‌సైట్లో తెలపండి

- ఆరోగ్య శాఖ విజ్ఞప్తి

పెరంబూర్, మార్చి 25: ప్రజలు తమ తమ ప్రాంతాల్లోని జ్వర పీడితులపై వెబ్‌సైట్‌లో సమాచారం అందించాలని ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అంటువ్యాధుల పర్యవేక్షణ, నియంత్రణ కార్యకలాపాల కోసం ఇంటిగ్రేటెడ్ హెల్త్ వెబ్‌సైట్, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రాం వెబ్‌సైట్లు పునరుద్ధరించారు. అంటువ్యాధుల వ్యాప్తి నివారించేలా హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ ఆరోగ్య నర్సులు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి అందిన వ్యాధుల సమాచారం అప్‌లోడ్ చేసి, జిల్లా ఆరోగ్య అధికారులకు తెలియజేసి, తగిన చర్యలు చేపడతుతున్నారు. ఈ సమాచారం ప్రజలు నేరుగా తెలుసుకొనేలా వెబ్‌సైట్ సౌకర్యం కల్పించారు. ప్రజలు తమ ప్రాంతాల్లోని జ్వరం, జలుబు, దగ్గు, విరేచనాలు, చర్మ సంబంధిత సమస్యలు, కామెర్లు, కుక్క కాటు తదితరాలను https://ihip.mlhfw.gov.in/dss/#!/లో పేరు, సెల్‌ఫోన్ నెంబర్, ఉద్యోగం, గ్రామం, జిల్లా తదితర వివరాలు నమోదు చేయవచ్చు.

'బొంగరం' గుర్తు కేటాయించండి

- ఎండీఎంకేపై నేడు హైకోర్టు విచారణ

పెరంబూర్, మార్చి 25: లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి 'బొంగరం' గుర్తు కేటాయించాలని ఎండీఎంకే దాఖలు చేసిన పిటిషన్ విచారణ మంగళవారం జరగనుంది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో దాఖలు చేసిన పిటిషన్‌లో... 1996 నుంచి లోక్‌సభ, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 'బొంగరం' గుర్తుపై పోటీ చేస్తున్నామని, 2006లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 6 శాతం కన్నా తక్కువగా ఓట్లు రాలేదని పార్టీ అంగీకారం రద్దయిందని తెలిపారు. 2014 ఎన్నికల్లో తమకు కేటాయించిన 'బొంగరం' గుర్తు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ కేటాయించాలని ఎన్నికల సంఘానికి వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందన్నారు. లోక్‌సభ ఎన్నికల నామినేషన్ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో, తమ పార్టీకి 'బొంగరం' గుర్తు కేటాయించేలా ఈసీకి ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణ జాబితాలో చేర్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

'మామిడి పండు' గుర్తు కోసం పీఎంకే పిటిషన్

అడయార్, మార్చి 25: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి మామిడి పండు గుర్తును కేటాయించాలని కోరుతూ పీఎంకే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ బీజేపీ కూటమిలో 10 స్థానాల్లో పోటీ చేస్తున్న విషయం తెల్సిందే. అయితే గత 2006లో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి ఆరు శాతం కంటే తక్కువ ఓట్లు రావడంతో ఆ పార్టీ ఎన్నికల గుర్తును కేంద్ర ఎన్నికల సంఘం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు మామిడి పండు గుర్తునే కేటాయించేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పీఎంకే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై నేడు విచారణ జరిగే అవకాశం ఉంది.

ఐపీఎల్ టీముల్లాగే అన్నాడీఎంకేలో జట్లు

- మంత్రి ఉదయనిధి ఎద్దేవా

ప్యారీస్, మార్చి 25: ఐపీఎల్ మ్యాచ్‌లో పోటీపడే టీముల్లాగే అన్నాడీఎంకేలో కూడా పలు పేర్లతో టీములున్నాయని మంత్రి ఉదయనిధి వ్యాఖ్యానించారు. తేని లోక్‌సభ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి తంగ తమిళ్‌సెల్వన్‌కు మద్దతుగా ఆయన ప్రచారం చేపట్టారు. నూతన విద్యా విధానం ద్వారా మళ్లీ కుల విద్యను అమలుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ విధానం అమల్లోకి నిమ్నజాతుల పిల్లలు చదువుకోరాదు, ఉద్యోగాలకు పోరాదు అన్న కోణంలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. తమిళ భాషాభివృద్ధికి రూపాయ కూడా అందజేయని ప్రధాని మోదీ, రాష్ట్రంలో నిర్వహించే ప్రచారసభల్లో తమిళం, తిరుక్కురల్, తమిళ సాహితీవేత్తల గురించి పొగుడుతూ మాట్లాడుతుంటారని, ఇది కేవలం ఓట్లు రాబట్టుకొనేందుకేనని విమర్శించారు. చెన్నై, ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా పలు క్రికెట్ జట్లు ఐపీఎల్ మ్యాచ్‌లో పాల్గొంటున్నాయని, వీటిలో ఉన్న క్రికెటర్లు ఇండియా జట్టులో తరఫున ఒకటిగా ఆడతారన్నారు. ఇదు తరహాలో అన్నాడీఎంకేలో ఈపీఎస్, ఓపీఎస్, మోదీ, జె.దీప, టీటీవీ దినకరన, వీకే శశికళ పేర్లతో జట్లు ఉన్నాయని ఉదయనిధి చమత్కరించారు.

నామినేషన్ల సునామీ

రిటర్నింగ్ అధికారుల ముందు పోటెత్తిన అభ్యర్థులు ● నామినేషన్‌పత్రాలతో బారులు తీరిన ప్రధాన పార్టీల నేతలు

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఫాల్గుణ పౌర్ణమి ఉత్తర శుభముహూర్తం కావడంతో సోమవారం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్లు వెల్లువెత్తాయి. డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలు, డీఎండీకే, పీఎంకే వంటి ప్రధాన పార్టీల నుంచి చిన్నాచితకా పార్టీల వరకు అన్ని పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు పోటీపడ్డారు. ఉదయం శుభముహూర్తం కావడంతో అందరూ తమ నామినేషన్లతో రిటర్నింగ్ అధికారుల వద్ద బారులు తీరారు. కొంతమంది తమ ఇష్టదైవాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి నామినేషన్ల దాఖలుకు బయలుదేరగా, మరికొంతమంది మంచి శకునం చూసుకుని మరీ ముందుకు సాగారు. అయితే అభ్యర్థులు భారీగా తరలిరావడంతో కార్యాలయాల వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడింది. అదే సమయంలో గతానికి భిన్నంగా ఆయా ప్రాంతాల వద్ద సందడి కనిపించింది. ఈ సందర్భంగా నామినేషన్ల దాఖలు దృశ్యాల సమాహారం మీ కోసం...

డీఎంకే కూటమి అభ్యర్థులు...





మదురై లోక్‌సభ నియోజకవర్గం డీఎంకే కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నవెంకటేశన్(సీపీఎం) - ఆరణిలో ఎంఎస్ ధరణివేందన్(డీఎంకే) - సేలంలో సెల్వ గణపతి(డీఎంకే)





దిండుగల్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న ఆర్.సచ్చిదానందం(సీపీఎం) - రామనాథపురంలో నవాజ్ ఘనీ(ఐయూఎంఎల్) - తిరువణ్ణామలైలో అన్నాదురై(డీఎంకే)





తిరుచ్చిలో నామినేషన్ దాఖలు చేస్తున్న దురై వైగో(ఎండీఎంకే) - శ్రీపెరుంబుదూర్‌లో టీఆర్ బాలు - విల్లుపురంలో రవికుమార్(డీపీఐ)



వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేస్తున్న డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్



కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో నామ్ తమిళర్ పార్టీ తరపున పోటీ చేస్తున్న వీరప్పన్ కుమార్తె విద్యారాణి, నామినేషన్ వేసే ముందు తన తండ్రి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

అన్నాడీఎంకే అభ్యర్థులు...





విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే కూటమి తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న డీఎండీకే అభ్యర్థి విజయ్ ప్రభాకరన్ - మదురైలో డాక్టర్ శరవణన్(అన్నాడీఎంకే) - కోయంబత్తూర్‌లో సింగై రామచంద్రన్(అన్నాడీఎంకే)





కడలూరులో నామినేషన్ దాఖలు చేస్తున్న శివకొళుందు(డీఎండీకే) - వేలూరులో పసుపతి(అన్నాడీఎంకే) - ఆరణిలో జీవీ గజేంద్రన్(అన్నాడీఎంకే)





తిరుచ్చిలో నామినేషన్ దాఖలు చేస్తున్న కరుప్పయ్య(అన్నాడీఎంకే) - మైలాడుదురైలో బాబు(అన్నాడీఎంకే) - కళ్లకుర్చిలో కుమరగురు(అన్నాడీఎంకే)



నీలగిరి నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఎల్.మురుగన్, చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



కన్నియాకుమారి లోక్‌సభ నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి పొన్.రాధాకృష్ణన్



తిరుచ్చిలో సెంథిల్‌నాథన్ (ఏఎంఎంకే)



తిరునల్వేలిలో నయినార్ నాగేంద్రన్ (బీజేపీ)



ధర్మపురిలో సౌమ్య అన్బుమణి (పీఎంకే)

బీజేపీ అభ్యర్థులు...



వేలూరులో ఏసీ షణ్ముగం (పుదియ నీతి పార్టీ)



విరుదునగర్‌లో నటి రాధిక (బీజేపీ)



మధ్య చెన్నై లోక్‌సభలో వినోద్ పి.సెల్వం (బీజేపీ)

ఇతరులు



రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం



కన్నియాకుమారిలో మరియ జెనీఫర్ (నామ్ తమిళర్ కట్చి)



వేలూరులో మహేష్ ఆనంద్ (నామ్ తమిళర్ పార్టీ)

చిత్రజ్యోతి

మిర్చి విజయ్ - అంజలి నాయర్ జంటగా 'వైఫ్'



'వైఫ్'లో మిర్చి విజయ్ - అంజలి నాయర్

యాంకర్ మిర్చి విజయ్, అంజలి నాయర్ జంటగా 'వైఫ్' పేరుతో ఒక చిత్రం తెరకెక్కుతోంది. ఒలంపియా మూవీస్ బ్యానరుపై నిర్మాత ఎస్.అంబేత్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆర్.హేమనాథన్ దర్శకుడు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రం గురించి దర్శకుడు హేమనాథన్ మాట్లాడుతూ... 'భార్యభర్తల మధ్య ఉన్న ఆధునిక సంబంధ బాంధవ్యాలను ఇతివృత్తంగా తెరకెక్కించాం. స్టోరీకి తగినట్టుగానే 'వైఫ్' అనే టైటిల్‌ను ఖరారు చేశాం. మహిళ ఒక కుటుంబాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుంది. వివాహం తర్వాత చిగురించే ప్రేమను ఎంతో ఎమోషనల్‌గా స్ర్కీన్‌పై చూపించాం. ఆ విషయంలో సక్సెస్ అయ్యాం. 'వైఫ్' అనే టైటిల్ ఇప్పటివరకు ఏ ఒక్క చిత్రానికి ఉపయోగించలేదనే విషయం తెలిసి ఆశ్చర్యపోయా. అన్ని వయసుల వారు ఈ చిత్రాన్ని చూసేలా, ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా చిత్రీకరించాం' అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో మిర్చి విజయ్, అంజలి నాయర్‌తో పాటు మైత్రేయన్, రెడిన్ కింగ్‌స్లే, కల్యాణి నటరాజన్, విజయ్ బాబు, లల్లు, కదిర్ తదితరులు నటించారు. కేపీ శక్తివేల్ సినిమాటోగ్రఫీ అందించగా, జెన్ మార్టిన్ సంగీత స్వరాలు సమకూర్చారు.

'జీని' హృదయానికి దగ్గరైన చిత్రం : జయం రవి

తాను హీరోగా నటిస్తున్న 'జీని' చిత్రం తన హృదయానికి ఎంతో దగ్గరైన చిత్రం అని, మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అనుభవించేందుకు సిద్ధంగా ఉండండి అంటూ హీరో జయం రవి ట్వీట్ చేశారు. డాక్టర్ ఐసరి కె.గణేష్ సమర్పణలో వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో రూపుదిద్దుకునే ఈ చిత్రంలో జయం రవి సరసన కృతి శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, వామికా గబ్బి, దివ్యవాణి నటిస్తున్నారు. సంగీతం ఏ.ఆర్.రెహ్మాన్. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం ద్వారా భువనేష్ అర్జునన్ తొలిసారి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ యేడాది విడుదలకానున్న ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను ఆదివారం విడుదల చేశారు. ఇందులో పొడవాటి జుట్టుతో చేజింగ్ మూడ్‌లో ఉన్న జయం రవిని చైన్ రౌండప్ చేస్తూ కనిపిస్తుండగా, డబ్బు, బంగారు నాణేలు, ఐస్ క్రీం ఉన్నాయి. ఎంతో ఆసక్తికరంగా ఉన్న జయం రవి... ఈ సారి ఎలాంటి లుక్‌లో రాబోతున్నాడనేది చర్చనీయాంశంగా మారింది. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేసిన ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహ్మాన్ ట్వీట్ చేస్తూ, 'జీని' మూవీ ఉత్తేజకరమైన ఫాంటసీ రైడ్‌గా ఉంటుందని, ఈ సినిమా ఆడియన్స్‌కు ఒక మ్యాజికల్ అనుభూతినిస్తుందని పేర్కొన్నారు.



'జీని' ఫస్ట్‌లుక్

5న కయల్ ఆనంది నటించిన 'వైట్ రోజ్' రిలీజ్



'వైట్ రోజ్'లో ఓ దృశ్యం

పూంపార్వై మురుగన్ ప్రొడక్షన్స్ నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ రాజశేఖర్ రూపొందించిన చిత్రం 'వైట్ రోజ్'. కయల్ ఆనంది ప్రధాన పాత్రను పోషించారు. ఈ థ్రిల్లర్ మూవీ ఏప్రిల్ 5న విడుదల కానుంది. విజిత్, బేబీ నక్షత్ర, శశిలయా, గణేశ్, రామనాథన్ తదితరులు నటించారు. ఈ సినిమా గురించి నిర్మాత ఎన్.రంజని మాట్లాడుతూ... 'ఈ సినిమాలో పోలీస్ కంట్రోల్ రూం కీలక పాత్రగా ఉంటుంది. వాస్తవికంగా ఉండాలన్న లక్ష్యంతో కొన్ని లక్షల రూపాయలతో పోలీస్ కంట్రోల్ రూం సెట్‌ను నిర్మించాం. ఈ చిత్రం ద్వారా సుశిగణేశన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన రాజశేఖర్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. ఇళయరాజా సినిమాటోగ్రఫర్‌గా పనిచేయగా, వైరముత్తు గేయరచన చేశారు. సుదర్శన్ సంగీత స్వరాలు సమకూర్చారు. చిత్రీకరణతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను పూర్తి చేసుకుంది' అని పేర్కొన్నారు.